
# సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 25 । మే । 2025



**సోమశిలలో 44.518 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో శనివారం 44.518 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,130, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.99,700 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.8,990 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.9,260 |
| నవర (8 గ్రా) | రూ.74,080 |

గరిష్టం/కనిష్టం
39.0 /29.4

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 52 శాతంగా నమోదైంది.

## న్యూస్‌రీల్

### 4, 5 తేదీల్లో పింఛను, జీపీఎఫ్ కేసుల అదాలత్

నెల్లూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న పింఛను, జీపీఎఫ్ కేసులను సమీక్షించి పరిష్కరించడానికి జూన్ 4, 5 తేదీలలో నెల్లూరు, వింజమూరులలో పింఛను, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డీడీఓలకు విజయవాడ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం వారు అవగాహన కల్పిస్తారని తెలిపారు. పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రేపు మెమూ రైలు రద్దు

నెల్లూరు సిటీ: సూళ్లూరుపేట – నెల్లూరు (66037), నెల్లూరు– సూళ్లూరుపేట (66038) మధ్య నడిచే మెమూ రైలు రేపు (సోమవారం) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారి శనివారం ప్రకటనలో తెలిపారు.

### మద్యం బెల్టు దుకాణాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..

కలిగిరి: తెల్లపాడు, సిద్ధనకొండూరు గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలపై కలిగిరి ఎక్సైజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. సాక్షిలో శనివారం ప్రచురితమైన 'తమ్ముళ్లకు కాసులు.. కూలుతున్న కాపురాలు' కథనంపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. కలిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కలిగిరి, వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు మండలాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తెల్లపాడు, సిద్ధనకొండూరు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమం మద్యం, నాటుసారా అమ్మకాలు జరుపుతుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### బదిలీలకు 28లోపు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ కోసం ఈ నెల 28వ తేదీలోపు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యారమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 2వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఎంపీడీఓలు వారి కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన పూర్తి వివరాలను నిర్దేశించిన ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేసి దరఖాస్తులను ఈ నెల 28 లోపు జెడ్పీ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో

# అడ్డగోలు దోపిడీ



ముదివర్తి - ముదివర్తిపాళెం నడుమ కాజ్‌వే నిర్మాణ పనులు





- కూటమి ప్రభుత్వంలో అంచనాల్లో మార్పులు
- చదరపు అడుగుకు రూ.22 వేల చొప్పున చెల్లింపులు
- వాస్తవంగా చెల్లించాల్సింది చ.అ.కు రూ.6 వేలే
- 16 మీటర్లు వేయాల్సిన షీట్ ఫైలింగ్ 8 మీటర్ల వరకే
- నాణ్యతలేని పనులపై స్థానికుల ఆందోళన

**నాసిరకంగా ముదివర్తి - ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణ పనులు**

కూటమి ప్రభుత్వంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో అడ్డగోలుగా దోపిడీ జరుగుతోంది. పదికాలాల పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడే పనుల్లో కూడా అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇరిగేషన్ అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ అత్యాశ, స్థానిక ఎమ్మెల్యే సహకారం వెరసి కోవూరు నియోజకవర్గంలోని ముదివర్తి – ముదివర్తిపాళెం కాజ్‌వేలో అవినీతి ఊట ఊరుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: విడవలూరు మండలంలో పెన్నా నదిపై ముదివర్తి - ముదివర్తిపాళెం గ్రామాల వద్ద కాజ్‌వే నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో మంజూరయింది. మొత్తం రూ.97 కోట్లతో పనులు పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచారు. పలువురు కాంట్రాక్టర్లు పోటీపడినా ఎవరూ క్వాలిపై కాలేదు. కానీ ఆర్‌కేఎస్ ప్రాజెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ అధికారులను మేనేజ్ చేసుకుని ఆ పని దక్కించుకుంది. ఎస్టిమేషన్‌లోనే పలు మార్పులు చేశారు. ప్రభుత్వం మారడంతో రూ.కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారుల సహకారంతో నాసిరకంగా పనులు చేస్తున్నారు.

**చదరపు అడుగుకు రూ.22 వేలు**

ఇరిగేషన్ పనుల్లో చదరపు అడుగుకు సాధారణంగా రూ.5వేల నుంచి రూ.6వేలతో వర్క్‌లు చేసేలా ప్రతిపాదనలు చేస్తారు. కానీ పెన్నానదిలో కాజ్‌వే నిర్మాణం కావడంతో చదరపు అడుగుకు అదనంగా మరో రూ.2 వేలు వేసుకున్నా రూ.8 వేలు వంతున చేయొచ్చు. కానీ సదరు వర్కుకు ప్రత్యేకంగా క్యూబిక్ మీటర్‌కు రూ.22 వేలు చొప్పున అంచనాల్లో చూపారు. ఈ మేరకు బిల్లుల్లోనే చేతివాటం ప్రదర్శించి కోట్ల రూపాయలు ప్రజాధనం కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళుతోంది.

**ఎనిమిది మీటర్ల వరకే షీట్ ఫైలింగ్**

పెన్నా నదిలోకి సముద్రపు జలాలు చొచ్చుకు వచ్చే ప్రాంతంలో కాజ్‌వే నిర్మాణం కావడంతో అక్కడ 16 మీటర్ల లోతు వరకు షీట్ ఫైలింగ్ చేసేలా నిపుణులు ప్రతిపాదనల్లోనే పొందుపరిచారు. ఇసుక ప్రాంతం కావడంతో నిర్మాణం గట్టిగా ఉండాలంటే 16 మీటర్లు లోతులో షీట్ ఫైలింగ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్ స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో కుమ్మక్కై కేవలం 8 మీటర్ల వరకే షీట్ ఫైలింగ్ చేసి ఇసుకతో కార్పెట్ వేశాడనే ఆరోపణలున్నాయి. ఎం–బుక్‌లో మాత్రం 16 మీటర్ల వరకు షీట్ ఫైలింగ్ చేసినట్లు రికార్డు చేయించుకుని బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీని వల్ల కాజ్‌వేకు ప్రమాదం పొంచి ఉంది. పదికాలాల పాటు ఉండాల్సిన కాజ్‌వే నాలుగేళ్లకే దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు చెపుతున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాజ్‌వే నిర్మాణ పనులు ప్రస్తుత కూటమి నేతల ధనదాహానికి నాసిరకంగా జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాత తేదీలతో బిల్లులు**

ఇప్పటి వరకు పనుల్లో పెద్దగా పురోగతి లేకున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం కాంట్రాక్టర్లపై ప్రేమ ఒలకపోసి ఆగమేఘాలపై బిల్లులు చేస్తున్నారు. ఇప్పటికి రూ.22 కోట్ల బిల్లులు రికార్డ్ చేయగా అందులో రూ.11 కోట్లకు ఎల్‌ఓసీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం డివిజన్ ఈఈ రిటైర్డ్ స్టేజీలో ఉండడంతో ఆయన హయాంలోనే బిల్లులు చేసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**స్థానికుల ఆందోళన**

కాజ్‌వే నిర్మాణంలో పనుల నాణ్యతపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదికాలాల పాటు ఉండాల్సిన నిర్మాణం... కాంట్రాక్టర్, అధికారుల అవినీతి కారణంగా నాలుగేళ్లకే దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా స్థానికులు ఇరిగేషన్ శాఖ కార్యదర్శికి కాజ్‌వే నిర్మాణంలో జరిగే అవినీతిపై ఫిర్యాదు చేశారు.

**చేసిన పనులకే బిల్లులు**

ముదివర్తి – ముదివర్తిపాళెం కాజ్ నిర్మాణంలో ఎలాంటి అవకతవకతలు జరగడం లేదు. చేసిన పనుల వరకే బిల్లులు ఇస్తున్నాం. గత ప్రభుత్వంలోనే ఈ కాంట్రాక్ట్ మంజూరయింది. నాణ్యత ప్రమాణాల మేరకే పనులు చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

– దేశినాయక్, ఇరిగేషన్ ఎస్ఈ, నెల్లూరు

# గంజాయి నిందితులపై పీడీ యాక్ట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

- మత్తు, మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్, ఎస్పీల ఆదేశం

నెల్లూరు(క్రైమ్): గంజాయి కేసుల్లో పదేపదే పట్టుబడుతున్న నిందితులపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయాలని, మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు అన్నారు. శనివారం జిల్లా స్థాయి నార్కొటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ, వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాలంటే కేవలం గంజాయి కాదని, మత్తు ఉత్ప్రేరకాలు సైతం సమాజానికి ప్రమాదమేనన్నారు. మత్తుకు బానిసైన వ్యక్తులను గుర్తించి వారిని డీఅడిక్షన్ కేంద్రాలో చేర్పించాలన్నారు. అనంతరం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమరవాణా కట్టడికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ, డ్రగ్స్ కంట్రోల్ ఏడీ, డీఈఓ, టెరిటోరియల్ ఫారెస్ట్ ఆఫీసర్, అగ్రికల్చర్ జేడీ, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ కమాండెంట్, ఆర్డీఓ, కృష్ణపట్నం పోర్టు సీఈఓ, ఇంటెలిజెన్స్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆనందం అంతలోనే ఆవిరైంది





మృతిచెందిన ఆయేషా, రోదిస్తున్న తల్లి దిల్షాద్

- కేరింతలతో అల్లరి చేసిన చిన్నారి
- రోడ్డు దాటుతూ కారు ఢీకొని మృతి
- తల్లడిల్లిన తల్లిదండ్రులు
- కొరిమెర్లలో విషాదం

సంగం: అప్పటి వరకు కేరింతలు కొడుతూ.. అల్లరి చేసిన ఆ చిన్నారిని మృత్యువు కారు రూపంలో వెంటాడింది. దీంతో ఆనందం ఆవిరై ఆ కుటుంబం ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే సంగం మండలం కొరిమెర్ల సమీపంలో సంగం-కలిగిరి రహదారిపై శనివారం రోడ్డు దాటుతున్న ఆరేళ్ల చిన్నారి ఆయేషాను కలిగిరి వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ చిన్నారిని తల్లిదండ్రులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయేషా సంగం మండలం తలుపూరుపాడుకు చెందిన నాయబ్ రసూల్, దిల్షాద్‌ల కుమార్తె. వీరు కొరిమెర్ల సమీపంలో మామిడితోపు లీజుకు తీసుకుని మామిడి కాయలు విక్రయిస్తుంటారు. కుమార్తె ఆయేషా వారి దగ్గరే ఉంటోంది. శనివారం ఆయేషా సరదాగా ఆడుకుంటూ, నవ్వుకుంటూ అందరినీ ఆటపట్టిస్తోంది. ఈ క్రమంలో ఆయేషా రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. అక్కడికక్కడే నేలకొరగడంతో స్థానిక వైద్యశాలకు తరలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధి కూలీల ఆకలి కేకలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- మూడు నెలలుగా నిలిచిన పేమెంట్లు
- జిల్లా వ్యాప్తంగా 4లక్షల జాబ్‌కార్డులు
- ప్రస్తుతం పనులకు వస్తోంది 80 వేల మందే
- సీసీ రోడ్లు వేసిన కాంట్రాక్టర్లకూ అందని బిల్లులు

**ఉపాధి హామీ పథకం పనులు చేసే కార్మికులు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. మూడు నెలలుగా వారికి వేతనాలు అందడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేసిన కాంట్రాక్టర్లకు కూడా నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించ లేదు. దీంతో అప్పులు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.**

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఉపాధి హామీ పథకం కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. సుమారు రూ.20 కోట్లకు పైగా బకాయిలు నిలిచిపోయాయి. వీటిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు రావాల్సి ఉందని సమాచారం. శ్రామికులు పేమెంట్ల కోసం, సిబ్బంది వేతనాల కోసం, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం మూడు నెలలుగా ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉపాధి హామీ పథకాన్ని తమ కనుసన్నల్లో ఉంచుకోవాలని ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేశారు. ఫలితంగా పథకం అమలులో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జిల్లా వ్యాప్తంగా 80 శాతం మందికి పైగా ఫీల్డు అసిస్టెంట్లను తొలగించారు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, మండల టీడీపీ నాయకులు సూచించిన వ్యక్తులనే ఎఫ్‌ఏలుగా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టారు. ఒక్కో పంచాయతీలో ఇద్దరు ముగ్గురు ఫీల్డు అసిస్టెంట్లు పనిచేయడం విడ్డూరంగా ఉంది. మండలంలో ఇద్దరు టీడీపీ నాయకులు ఉంటే వారికి అనుకూలంగా ఉండే వ్యక్తులను ఎఫ్‌ఏలుగా నియమించాలంటూ ఎంపీడీఓలపై ఒత్తిడులు చేశారు. దీంతో ఎంపీడీఓలు నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌ఏలను నియమించారు. నిబంధనల ప్రకారం ఫీల్డు అసిస్టెంట్లపై ఆరోపణలు వస్తే విచారణ చేపట్టాలి. నివేదికలను జిల్లా అధికారికి అందజేయాలి. ఫీల్డు అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే అతన్ని విధుల నుంచి తొలగించాలి. అనంతరం పంచాయతీ తీర్మానంతో కొత్త ఎఫ్‌ఏను నియమించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం నిబంధనలకు పాతర వేసింది. చాలామందిని బెదిరించి తొలగించింది. అయితే తొలగించిన ఫీల్డు అసిస్టెంట్ల పేర్లే ఆన్‌లైన్‌లో దర్శనమిస్తున్నాయి. కొత్తవారి పేర్లు ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో వేతనాలు ఎవరికి ఇవ్వాలో అధికారులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన యాప్‌లను సైతం బలవంతంగా లాక్కొని కొత్త ఫీల్డు అసిస్టెంట్లు చేత పనులు చేయిస్తున్నారు. ఉపాధి పనులకు సంబంధించి వచ్చే సంవత్సరం నిర్వహించే సోషల్ ఆడిట్‌లో ఎవరు పనులు చేశారు..? ఎవరిపైన పెనాల్టీలు వేయాలో..? అర్థం కాని పరిస్థితులు అధికారులకు ఎదురయ్యే అవకాశం ఉంది.

**హాజరు శాతం పెంచాలని కలెక్టర్ చెబుతున్నా..**

జిల్లాలో సుమారు 4 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగిన శ్రామికులు ఉన్నారు. నిత్యం లక్ష మందికి పైగా శ్రామికులు పనులకు హాజరు కావాల్సి ఉంది. కూటమి నేతలు అత్యుత్సాహం, కొత్త ఫీల్డు అసిస్టెంట్ల నియామకం, పేమెంట్లు చెల్లింపుల్లో నెలలతరబడి జాప్యం తదితర కారణాల వల్ల ఉపాధి హామీ పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్య గణనీయంగా తగ్గి పోయింది. ప్రస్తుతం 70 వేల నుంచి 80 వేల మంది శ్రామికులు పనులకు హాజరవుతున్నారు. వీరికి సుమారు రూ.20 కోట్లకు పైగా పేమెంట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. కలెక్టర్ ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి పనులకు హాజరయ్యేవారి సంఖ్య లక్షకు పైగా పెంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వివిధ కారణాల వల్ల పనులకు హాజరయ్యేవారి సంఖ్య తక్కువగా ఉంటోంది.

**వేతనాలు మంజూరవుతాయి**

ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులకు త్వరలో పేమెంట్లు పూర్తి స్థాయిలో విడుదల కానున్నాయి. సిబ్బందికి సైతం మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలాఖరుకు వేతనాలు మంజూరయ్యే అవకాశం ఉంది. ఉపాధి పనులు వేగవంతంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– గంగాభవాని, డ్వామా పీడీ

**ఉపాధి పనులతో అభివృద్ధి కార్యక్రమాలు**

ఉపాధి హామీ పనులు ఎంత ఎక్కువగా జరిగితే జిల్లాకు ఆ స్థాయిలో మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు మంజూరు అవుతాయి. ఉపాధి పథకం కింద భవన నిర్మాణ పనులు, సీసీ రోడ్లు, డ్రైన్లకు నిధులు మంజూరు అవుతాయి. కూటమి ప్రభుత్వ నేతల అత్యుత్సాహం వల్ల ఉపాధి పనులకు బ్రేకులు పడుతున్నాయి. పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్య తగ్గి పోయింది. ఫలితంగా జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు అరకొరగా మంజూరవుతున్నాయి.

## క్లుప్తంగా

### అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటివారిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన అంజుమ్‌కు కావలికి చెందిన ఇర్ఫాన్ అలీతో వివాహమైంది. కొద్దిరోజులు వీరు అన్యోన్యంగా ఉన్నారు. ఆపై అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధింపులకు గురిచేయసాగారు. మద్యం మత్తులో ఆమెను భర్త మానసికంగా, శారీరకంగా హింసించేవారు. వీరి వేధింపులను తాళలేక పుట్టింటికొచ్చారు. పెద్దల సమక్షంలో పలుమార్లు మధ్యస్థం చేసినా భర్త, అత్తింటివారి తీరులో మార్పురాలేదు. దీంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో ఢీకొనడంతో వాహనచోదకులకు గాయాలు

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గూడూరుకు చెందిన మహేష్, రవి పనినిమిత్తం నిడిగుంటపాళేనికి వెళ్లారు. తిరిగి గూడూరు వెళ్లే క్రమంలో సర్వేపల్లి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

### వృద్ధుడి ఆత్మహత్య

ఆత్మకూరు: వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్ వివరాల మేరకు.. మండలంలోని కరటంపాడు గిరిజనకాలనీకి చెందిన అబ్బూరి శేషయ్య (64) నిత్యం మద్యం సేవిస్తుంటారు. ఈ క్రమంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని శుక్రవారం సాయంత్రం సేవించారు. కొద్దిసేపటి అనంతరం గమనించిన బంధువులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### వృద్ధురాలి అదృశ్యం



నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌కు రామదులరై తన కుటుంబసభ్యులతో కలిసి ఝాన్సీ నుంచి తిరుపతికి రైలులో బయల్దేరారు. ఈ నెల 19న ఆమె నెల్లూరులో రైలు దిగారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నెల్లూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరిచందన ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారానికి 42.019 టీఎంసీ నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగకు 2250, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 60, హైలెవల్‌కు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 133
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 187

### పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

# బదిలీలు.. కాదండోయ్ బేజారే

**దరఖాస్తు చేసుకోవాలంటే గగనమే**

- తరచూ మొరాయిస్తున్న సర్వర్
- గంటల తరబడి పడిగాపులు
- సమస్యలు పరిష్కరించకుండానే సాఫ్ట్‌వేర్ రూపకల్పన
- వివరాలను గోప్యంగా ఉంచుతున్న జిల్లా విద్యాశాఖ
- ముగిసిన స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తు ప్రక్రియ



ఆన్‌లైన్ సెంటర్‌లో ఉపాధ్యాయుల పడిగాపులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో గురువులకు బదిలీల బెంగ పట్టుకుంది. ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్తే సర్వర్ మొరాయిస్తోంది. ఫలితంగా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొద్దిసేపే పనిచేస్తూ.. ఆపై సమస్య మళ్లీ మొదటికొస్తోంది. సాఫ్ట్‌వేర్‌ను సక్రమంగా డిజైన్ చేయకపోవడంతో అంతా తప్పులతడకగా దర్శనమిస్తోంది. ఈ పరిణామాలతో ఏమి చేయాలో ఉపాధ్యాయులకు పాలుపోవడంలేదు.

**అంతా లోపభూయిష్టం**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎనిమిదేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు 1289, సెకండరీ గ్రేడ్ టీచర్లు 1482, ఐదేళ్లు పూర్తి చేసుకున్న హెడ్‌మాస్టర్లు 45 మంది ఉన్నారు. వీరితో పాటు రెండేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు రిక్వెస్ట్ కింద బదిలీ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇలా జిల్లాలో దాదాపు మూడు వేల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. హెడ్‌మాస్టర్ల దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ముగియగా, స్కూల్ అసిస్టెంట్లకు శనివారంతో పూర్తయింది. అయితే దరఖాస్తు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వీరికి రావాల్సిన పాయింట్లు వ్యక్తిగత వివరాల్లో కనిపించడంలేదు. ఏమైనా సమస్యలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిప్యూటీ డీఈఓను కలవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఉచిత సలహాలిస్తున్నారు.

**అస్తవ్యస్తంగా..**

- రెండుసార్లు రీఅపోర్షన్‌మెంట్‌కు గురయ్యే వారికి ఏడు పాయింట్లను కేటాయించాలి. అయితే కొందరికే ఇవి వస్తున్నాయి.
- కొత్తగా రీఅపోర్షన్‌మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు రావడం లేదు.
- సర్వర్ కొంతమందికి అవైలబుల్ సూన్ అని, మరి కొందరికి అసలు ఓపెనే కావడం లేదు.
- రీఅపోర్షన్‌మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు రావడం లేదు.
- మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ 120 దాటితే అదనంగా ఎస్జీటీ పోస్టు ఉంటుందని చెప్పినా, అదెక్కడా కానరావడంలేదు. మిగులు ఉంటే ఇస్తామంటున్నారు.




అవైలబుల్ సూన్ అని చూపుతూ..

- ఎస్జీటీల కేడర్ స్ట్రెంథ్, సర్‌ప్లస్ జాబితాను నేటికీ విడుదల చేయలేదు.
- ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న హైస్కూల్ ప్లస్‌లలో 1, 2 తరగతుల విద్యార్థులు సమీపంలోని పాఠశాలల నుంచి వచ్చి ఇక్కడ చేరారు. ఆ సంఖ్యను నమోదు చేయకపోవడంతో పోస్టులు పెరగని పరిస్థితి నెలకొంది.
- పాఠశాలల కేటగిరీ – 4 (రోడ్డు సౌకర్యం లేని) జాబితాను ఇప్పటికీ ప్రదర్శించలేదు.

**కౌన్సెలింగ్ ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా..?**

తొలుత అన్ని కేడర్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్లోనే కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే ఆఫ్‌లైన్లో నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు పట్టుబట్టాయి. ఎస్జీటీలకు మాత్రమే ఆఫ్‌లైన్లో నిర్వహిస్తామని చెప్పినా, జీఓ ఇప్పటికీ జారీ కాలేదు. పైగా ఈ తరహాలో నిర్వహించలేమంటూ చాలా మంది డీఈఓలు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు మొరపెట్టుకున్నారని సమాచారం. మరోవైపు రెండేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న కొంతమంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. తాము కోరుకున్న ప్రాంతాన్ని సాధించాలనే లక్ష్యంతో అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారని తెలిసింది. డబ్బులు ముట్టజెప్పయినా తాము కున్నది సాధించేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు.

**దరఖాస్తు తేదీని పొడిగించాలి**

దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ తరచూ మొరాయిస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సరిచేయాలి. ఈ పరిణామాల క్రమంలో స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తు గడువును ఒకరోజు పొడిగించాలి. ఎస్జీటీల కేడర్ స్ట్రెంథ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు బహిర్గతం చేయాలి.
– సురేందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

**సాంకేతిక సమస్యలపై వాట్సాప్‌లో మెసేజ్‌లు పెట్టాలి**

సాఫ్ట్‌వేర్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారులకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలి. దీన్ని రాష్ట్ర విద్యాశాఖ ఐటీ విభాగ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం. ఈ విషయంలో ఎవర్నీ కలవాల్సిన అవసరం లేదు. రెండేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.
– బాలాజీరావు, డీఈఓ

### ఆంజనేయస్వామికి పూజలు



నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో దవనోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విశేషాలంకారంలో ఉన్న మూలవర్లను భక్తులు దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా మామిడి సత్యనారాయణ దంపతులు వ్యవహరించారు. ఈఓ రఘురామయ్య పర్యవేక్షించారు.



## రోగి మృతిపై కుటుంబసభ్యుల ఆందోళన

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఆస్పత్రి టెక్నీషియన్‌పై దాడి

నెల్లూరు(అర్బన్): డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రోగి మృతి చెందారంటూ నగరంలోని ఓ ఆస్పత్రి వద్ద బంధువులు ఆందోళన చేపట్టి టెక్నీషియన్‌పై దాడి చేశారు. మృతుడి కుటుంబసభ్యుల సమాచారం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం వరిగొండకు చెందిన వెంకటేశ్వర్లు (61)కు గుండె నొప్పి రావడంతో నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు శుక్రవారం సాయంత్రం తరలించారు. పరీక్షించిన అనంతరం రోగి గుండె వాల్వ్‌లకు అత్యవసరంగా రెండు స్టంట్లేయాలని డాక్టర్ చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద నాణ్యమైన స్టంట్లు రావని చెప్పడంతో, ఆస్పత్రికి రూ.80 వేల వరకు చెల్లించారు. ఈ క్రమంలో రోగికి ఇబ్బంది కలగడంతో మూడో స్టంట్‌నూ వేశారు. ఈ సమయంలో రోగి మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. అక్కడ ఉన్న టెక్నీషియన్‌ను డాక్టర్ ఫోన్ నంబర్ అడిగారు. ఆయన ఇవ్వకపోవడంతో రోగి కుమారుడు చేయిచేసుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గొడవ పెద్దది కాకుండా ఆపారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు మాట్లాడారు. మూడో స్టంట్‌ను వేయడంతో సీరియస్సై మృతి చెందారని ఆరోపించారు. మరోవైపు హార్ట్ ఎటాక్‌తో మరణించారని డాక్టర్లు పేర్కొంటున్నారు. రోగి కుటుంబసభ్యులతో చర్చించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని చైతన్యపురికాలనీలో నివసిస్తున్న సివిల్ కాంట్రాక్టర్ వెంకటస్వామిరెడ్డి (51) తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఈ నెల 20న వెళ్లారు. అనంతరం వైఎమ్సీఏ గ్రౌండ్స్‌లో పురుగుల మందు తాగుతున్నానని అదే రోజు రాత్రి తన భార్య రమాదేవికి ఫోన్ చేసి చెప్పారు. తల్లి ద్వారా విషయం తెలుసుకున్న చిన్న కుమారుడు తరుణ్ కుమార్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చికిత్స నిమిత్తం సమీపంలోని జయభారత్ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అపోలో హాస్పిటల్లో మరుసటి రోజు చేర్పించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. హాస్పిటల్‌కు ఎస్సై అబ్దుల్ రజాక్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## వింజమూరులో రెండిళ్లలో చోరీ



వెంకటేశ్వర్లు ఇంట్లో చిందరవందరగా వస్తువులు



బాధితులతో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

- 30 సవర్ల బంగారం, నగదు అపహరణ

వింజమూరు(ఉదయగిరి): పట్టణంలోని గాయత్రి నగర్‌లో రెండిళ్లలో చోరీ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. గాయత్రినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు.. జొన్నవాడలో దైవదర్శనానికి వెళ్లి శనివారం ఉదయం ఇంటికొచ్చారు. ఈ క్రమంలో ఇంటి తలుపులను పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. దేవుడి గదిలో దాచి ఉన్న 30 సవర్ల బంగారంతో పాటు బీరువాలోని రూ.13 వేలను అపహరించారనే అంశాన్ని గుర్తించారు. మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి పూజ గదిలో ఉన్న వెండి వస్తువులను చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.పది వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఘటనలపై పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని కలిగిరి సీఐ వెంకటనారాయణ పరిశీలించి బాధితుల నుంచి వివరాలను సేకరించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది.

## పోలీసుల పిల్లలకు కార్పొరేట్ విద్య




మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): పదో తరగతిలో ఉత్తీర్ణులైన పోలీసుల పిల్లలకు ఉచిత, రాయితీతో కూడిన కార్పొరేట్ విద్యను అందించేందుకు కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గల మినీ కాన్ఫరెన్స్ హాల్లో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాదిరిగానే పోలీసుల పిల్లలకు వీలైనంత ఉచిత, రాయితీ సీట్లను కేటాయించాలని కోరారు. దీనికి అంగీకరించిన 11 కళాశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలను తెలియజేశారు. కళాశాలల్లో విద్యార్థులకు విద్యను బోధించడమే కాకుండా ఈవ్‌టీజింగ్, మత్తుపదార్థాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఏఎస్పీ సౌజన్య, ఎస్బీ – 1 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలపై పడి నెమలికి గాయాలు



కందుకూరు రూరల్: మండలంలోని కొండికందుకూరు పంచాయతీలో రెండు నెమళ్లు పది రోజులుగా తిరుగుతున్నాయి. పంచాయతీలోని గౌతమ్‌నగర్‌లోకి వచ్చిన ఇవి అలా తిరుగుతూ బీసీ కాలనీలోకి వెళ్లాయి. ఇళ్లు, చెట్లపై తిరుగుతూ కిందికి దిగే క్రమంలో విద్యుత్ తీగలపై శనివారం పడింది. దీంతో నెమలి గాయపడింది. గ్రామస్తులు ప్రాథమిక చికిత్స చేసి, గాయాలైన చోట పసుపు పూశారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య సమాచారమిచ్చారు. కాగా మేము వదిలితే అడవిలోనే వదిలేస్తాం.. నెమళ్లను మీరూ వదిలేయండి.. వాటిపాటికి అవి వెళ్లిపోతాయని అటవీశాఖాధికారి సురేష్ సమాధానమిచ్చారు. వీటిని కాపాడాలని సర్పంచ్ కోరారు.